క్లుప్తంగా

దోమ తెరలు వాడండి



ముతుకూరు గ్రామంలో అబైట్‌ను పిచికారి చేయిస్తున్న సిద్ధయ్య, తదితరులు

వేంపల్లె : తాళ్లపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ముతుకూరు గ్రామంలో ఇంటింటా ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించి నిల్వలున్న నీటిలో అబేట్ పిచికారి చేసి, ప్రజలకు మలేరియా, డెంగ్యూ వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్య మాట్లాడుతూ ఆరోగ్య కార్యకర్తలు ప్రతి గ్రామాన్ని సందర్శించి జ్వరం ఉన్న వారికి రక్తపూతలు సేకరించి వారానికి మూడు సార్లు ల్యాబ్‌కు అందజేయాలన్నారు ఎవరికైనా మలేరియా నిర్ధారణ అయితే వెంటనే చికిత్స అందించి మలేరియా వచ్చిన వ్యక్తి గ్రామంలో ఫీవర్ సర్వే, లార్వా సర్వే చేసి గ్రామంలోని ప్రజలందరికీ రక్తపరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమములో ఎంఎల్‌హెచ్‌ఓ మాలతి, ఆరోగ్య కార్యకర్తలు, గ్రామ సర్పంచ్ గంగులయ్య పాల్గొన్నారు.

అనాథలకు వితరణ



దుస్తులను పంపిణీ చేస్తున్న దాతలు

ముద్దనూరు : స్థానిక భూమా మెడికల్ స్టోర్ యజమానులు మానసిక అనాథలకు దుస్తులను వితరణగా అందజేశారు. శనివారం మండలంలోని కోడిగాండ్లపల్లె సమీపంలోని ఏసు కరుణాలయంలోని అనాథలకు 100 టీ షర్టులు, 100 ప్యాంట్లు, పండ్లు, బ్రెడ్లు, బిస్కట్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో భూమా మెడికల్ స్టోర్ యజమానులు పాల్గొన్నారు.

రేపటి నుంచి మండలస్థాయి ఎస్‌జీఎఫ్‌ఐ ఎంపికలు

చింతకొమ్మదిన్నె : ఈనెల 23వ తేదీ సోమవారం బయినపల్లిలోని శ్రీ వెంకటేశ్వర ఉన్నత పాఠశాలలో మండలస్థాయి ఎస్‌జీఎఫ్‌ఐ టోర్నమెంట్ ఎంపికలు నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి వెంకట్రామిరెడ్డి, మండల కో ఆర్డినేటర్ రుద్రమూర్తి యాదవ్ తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ సోమవారం ఖోఖో, బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, అథ్లెటిక్స్ క్రీడా పోటీలకు ఎంపికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు స్టడీ సర్టిఫికెట్‌తో పాటు, ఎలిజిబులిటీ ఫామ్ తమ వెంట తీసుకురావాలన్నారు. మరింత సమాచారం కొరకు 9908783229, 9866431633 నంబర్లను సంప్రదించాల్సిందిగా వారు తెలిపారు.

ఆగని అక్రమ ఇసుక రవాణ



చిన్నదండ్లూరులోని పెన్నానది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్

ఎర్రగుంట్ల : మండలంలోని చిన్నదండ్లూరు గ్రామంలో అక్రమంగా ఇసుక రవాణ జోరుగా సాగుతోంది. అధికార పార్టీకి చెందిన కొందరు గ్రామస్తులు అక్రమంగా ఇసుకను పగలే రవాణ చేస్తున్నారు. సమీపంలో పెన్నానది ఉండటం వల్ల పట్టపగలే ఇసుకను ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. అధికారులు దాడులు చేసి పట్టుకుంటున్నా అక్రమ దారులు మాత్రం యాథేచ్ఛంగా ఇసుకను తరలిస్తున్నారు. మధ్యాహ్నం, సాయంత్రం వేళలలో అక్రమంగా ఇసుకను తరిస్తున్నారు.

కళాశాల పరిసరాలను శుభ్రంచేసిన విద్యార్థులు



కళాశాల పరిసరాలలో శుభ్రం చేస్తున్న విద్యార్థులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని ఫుడ్ అండ్ సైన్స్ కళాశాలలో స్వచ్ఛతా హీ సేవా లో భాగంగా పచ్చదనం, పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పెంచుతున్న నేరేడు మొక్కల తోటలో, కళాశాల పరిసరాలలో కలుపు మొక్కలు తొలగించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.మాధవ, ఎన్ఎస్ఎస్ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హారికకు డాక్టరేట్ ప్రదానం

వైవీయూ : కడప నగరానికి చెందిన బొమ్మి హారికకు కంప్యూటర్ సైన్స్‌లో తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. కంప్యూటర్ సైన్స్ ఆచార్యులు డా. సుధ పర్యవేక్షణలో 'అనాలసిస్ అఫ్ వెబ్ యూసెస్ మైనింగ్ బేస్డ్ ఆన్ వెబ్‌లాగ్ డేటా' అన్న అంశంపై ఈమె చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ ప్రదానం చేశారు. కాగా ఈమె అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఐటీ అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఈమె భర్త, బాలాజీ ఐటీ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ డా. ప్రవీణ్‌కుమార్, కుటుంబసభ్యులు అభినందనలు తెలిపారు.

ఆర్టీపీపీలో ఫ్లైయాష్‌ను సైతం వదలడం లేదు



యాష్ పాండ్ నుంచి అధిక లోడ్‌తో ఫ్లైయాష్‌ను తరలిస్తున్న లారీలు

ఎర్రగుంట్ల : మండలంలోని డాక్టర్ ఎంవీఆర్ ఆర్టీపీపీలో ఉన్న ఫ్లైయాష్(బూడిద)ను ఇష్టమొచ్చినట్లు కొందరు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అధికార పార్టీకి చెందిన కొందరు ఫ్లైయాష్ రవాణలో కీలక పాత్ర పోషిస్తున్నారు. అధిక లోడ్‌తో పోతున్నా పట్టించుకునే అధికారులు కరువయ్యారు. ఫ్లైయాష్ ఆధారంగా చాలా మంది జీవనోపాధి పొందుతున్నారు. ఫ్లైయాష్ పాండ్‌లో బూడిదను టిప్పర్లకు, లారీలకు లోడ్ చేయడానికి కొందరు ఇటాచ్, జేసీబీలను వాడి సొమ్ము చేసుకుంటున్నారు. ఆర్టీపీపీలోని యూనిట్ల నుంచి బయటకు వస్తున్న ఫ్లైయాష్‌ను పైపులైన్ ద్వారా యాష్ పాండ్‌కు తరలిస్తున్నారు. ఈ యాష్ పాండ్‌లో నిల్వ ఉన్న బూడిదను సిమెంట్ పరిశ్రమలకు, ఇటుకల పరిశ్రమలకు ఉపయోగిస్తుంటారు. సమీపంలో ఉన్న సిమెంట్ పరిశ్రమలకు ఈ బూడిదను తరలించడానికి కొందరు కాంట్రాక్ట్ తీసుకుని టిప్పర్లు, లారీల సాయంతో ఉచితంగా బూడిదను తీసుకెళుతున్నారు. అయితే ఇక్కడ యాష్ పాండ్ సమీప గ్రామాలలో ఉన్న కొందరు ఇటాచ్, జేసీబీలు పెట్టుకుని లారీలకు, టీప్పర్లకు లోడ్ చేస్తుంటారు. ఇలా లోడ్ చేస్తే ఒక్కొక్క వాహనంకు కొంత సొమ్మును వసూళ్లు చేస్తుంటారు. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో అధికార పార్టీకి చెందిన కొందరు ఫ్లైయాష్ మాటున గ్రావెల్‌ను కూడా తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం చూసిచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. అధిక లోడ్‌తో టిప్పర్లు, లారీలు కళ్ల ముందు తరలిపోతున్నా పట్టించుకోవడం లేదు. ఈ ఫ్లైయాష్ పాండులో ఉన్న బూడిదను ఆర్టీపీపీ ఆధ్వర్యంలో లోడ్ చేస్తే ఆర్టీపీపీకి పెద్ద ఎత్తున ఆదాయం సమకూరుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న వైద్య సిబ్బంది



కమలాపురం ప్రభుత్వ ఆసుపత్రి

కమలాపురం : వైద్య సిబ్బంది నిత్యం రోగులకు అందుబాటులో ఉండి ప్రసవాలు సైతం ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే జరగాలని స్వయానా జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఇటీవల పెండ్లిమర్రి మండలంలోని పీహెచ్‌సీ తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు జారీ చేశారు. కలెక్టర్ ఆదేశాలు సైతం కమలాపురం వైద్య సిబ్బంది బేఖాతరు చేస్తున్నారు. వైద్య సేవలు పొందాలంటే గంటల తరబడి వేచి ఉండక తప్పదం లేదు. వైద్యులు పరీక్షించి చికిత్స చేసి మందులు, ఇంజక్షన్ చేసుకోవాలని ప్రిస్కిప్షన్ రాసి ఇచ్చిన తర్వాత కూడా రోగులు నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. శనివారం ఇదే పరిస్థితి కమలాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో ఎదురైంది. మండలంలోని జీవంపేటకు చెందిన రేష్మా తీవ్ర జ్వరంతో బాధపడుతున్న తన 8 ఏళ్ల కుమారుడు అబ్దుల్ నజీర్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకువచ్చింది. అయితే వైద్యులు పరీక్షించి జ్వరం తీవ్రత ఎక్కువగా ఉందని ముందుగా ఇంజక్షన్ వేయించుకుని రమ్మని సూచించారు. ఆమె ఇంజక్షన్ గదికి వెళ్తే అక్కడ గదిలో ఎవరూ లేరు. ఇంక్షన్ వేయించుకోవడానికి దాదాపు 8 మంది నిరీక్షిస్తున్నారు. రేష్మా జనరల్ వార్డుకు వెళ్లింది. అక్కడ ఉన్న సిబ్బంది ఇంజక్షన్ గదికి వెళ్లమన్నారు. అటు ఇటు తిరిగినప్పటికి ఇంజక్షన్ గదిలో ఎవరూ లేరు. అపుడే అక్కడికి వెళ్లిన పాత్రికేయుల ఎదుట ఆమె తన బాధను వ్యక్తం చేసింది. అనంతరం అక్కడికి వచ్చిన స్టాఫ్ నర్స్ విజయలక్ష్మిని రోగుల పట్ల ఇంత నిర్లక్ష్యం వహిస్తే ఎలా అని విలేకరులు ప్రశ్నిస్తే తమకు పనులు ఉండవా? అని ఆమె వాగ్వివాదానికి దిగారు. తాము పాత్రికేయులని చెప్పినప్పటికి అయితే ఏమీ? వీడియో ఎందుకు తీస్తున్నారు? ఎవరిని అడిగి తీస్తున్నారని ఓ పాత్రికేయుని సెల్ ఫోన్ లాక్కుంటూ విఫల యత్నం చేస్తూ చిందులు తొక్కారు. అక్కడి ఆసుపత్రి సూపరింటెండెంట్ తాజుద్దీన్ ఘటనా స్థలానికి వచ్చినప్పటికి స్టాఫ్ నర్సుకు ఏమీ గాని చెప్పకపోవడం కొసమెరుపు. అంతకు ముందే ఆయనను వివరణ అడిగేందుకు పాత్రికేయులు ఆయన గదికి వెళ్లగా తాను జూమ్ మీటింగ్‌లో ఉన్నానని, పక్క గదిలో ఉన్న డాక్టర్‌తో మాట్లాడాలని చెప్పడం ఆయన నిర్లక్ష్యానికి నిదర్శనం. ఉన్నతాధికారులు ఈ విషయం పై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి ప్రకృతిని కాపాడాలి



పెద్ద దర్గా వద్ద మానవ హారంగా ఏర్పడిన కళాశాల విద్యార్థులు

కమలాపురం : ప్లాస్టిక్ భూతాన్ని తరిమి కొట్టాలని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి ప్రకృతిని కాపాడాలని సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాల కరస్పాండెంట్ రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం ప్లాస్టిక్ రహిత సమాజం అనే నినాదంతో కళాశాల ఎన్ఎస్ఎస్ శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కళాశాల నుంచి పెద్ద దర్గా వరకు ర్యాలీ నిర్వహించి, అక్కడ మానవ హారం ఏర్పాటు చేశారు. ప్లాస్టిక్ వద్దు... ప్రకృతి ముద్దు.. అని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ భూతాన్ని తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వాడకం వలనే అనేక అనర్థాలు కలుగుతున్నాయని వివరించారు. అధిక మొత్తంలో ప్లాస్టిక్ వాడటం వలన మనుషులకు శారీరకమైన రుగ్మతలు ఎన్నో వస్తున్నాయన్నారు. ముఖ్యంగా మానవులు చేస్తున్న నిర్లక్ష్యం కారణంగా మూగజీవాలు ప్లాస్టిక్ బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి ప్రకృతిని కాపాడాలన్నారు. అలా చేస్తే భవిష్యత్తు తరాల వారికి స్వచ్ఛమైన ప్రకృతిని అందించిన వారం అవుతామన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ అయ్యవారు, అశోక్ కుమార్, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు గంధం మహోత్సవం



గండికొవ్వూరులోని మౌలాలి సాహెబ్ దర్గా

చక్రాయపేట : మండలంలోని గండికొవ్వూరు గ్రామంలో వెలసిన మౌలాలి సాహెబ్ దర్గా వద్ద సోమవారం సాయంత్రం గంధం మహోత్సవ కార్యక్రమం జరగనున్నట్లు నిర్వాహకుడు పీర్‌బాషా తెలిపారు. చక్రాయపేటలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపం నుంచి దర్గా వరకు ఊరేగింపుగా అరచేతిలో నూనె వత్తి వెలిగించుకుని గంధం తీసుకొచ్చి మౌలాలి సాహెబ్ దర్గా వద్ద సమర్పించడం జరుగుతుందన్నారు. అలాగే అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తామన్నారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు.

ప్రకృతి వ్యవసాయంతోనే రైతులకు లాభసాటి



ఘన జీవామృతం తయారీ విధానాన్ని మహిళా రైతులకు వివరిస్తున్న మాస్టర్ ట్రైనర్ భాస్కర్‌రెడ్డి

వేముల : పంటల సాగులో రైతులకు ప్రకృతి వ్యవసాయమే లాభసాటిగా ఉంటుందని మాస్టర్ ట్రైనర్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని వీ.కొత్తపల్లెలో శనివారం ఘన జీవామృతం తయారీ విధానంపై రైతులకు ఆయన అవగాహన కల్పించి మాట్లాడారు. గ్రామంలో రైతు రామాంజనేయరెడ్డి, సుశీల ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో ఘన జీవామృతం తయారు చేస్తున్నారన్నారు. ఇందుకు 200 కిలోల ఆవు పేడ, 4 కిలోల పప్పు దినుసులు, పిండి, 4 కిలోల నల్లబెల్లం, పుట్ట మట్టి, తగినంత ఆవు మూత్రం తీసుకోవాలన్నారు. వీటిని కలియ తిప్పడం వాటిని పిడకలు చేసి నీడలో వారం రోజులు ఆరబెట్టడం ద్వారా ఘన జీవామృతం తయారవుతుందన్నారు. ఘన జీవామృతాన్ని ఏ పంటకైనా, పంట సాగు చేసే ముందు, సాగు చేసిన తర్వాత మొక్కకు అందించడంవలన భూమి సారవంతమై మొక్క అన్ని రకాల పోషకాలు తీసుకోవడం ద్వారా మంచి దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జిలు వెంకటేష్, రామ్మోహన్, ఐసీఆర్పీలు పాల్గొన్నారు.

పంచాయతీ నిధుల అవినీతిపై అధికారుల విచారణ



పంచాయతీ నిధుల గోల్‌మాల్‌పై విచారణ చేస్తున్న అధికారులు

వేంపల్లె : వేంపల్లె మేజర్ పంచాయతీలోని నిధుల అవినీతిపై అధికారులు విచారణ చేపట్టారు. శనివారం కలెక్టర్ ఆదేశాల మేరకు 5 మంది కమిటీ సభ్యులతో పంచాయతీ కార్యాలయంలో విచారణ చేశారు. ఈ సందర్భంగా 2016, 2017-18 ఏడాదికి సంబంధించి అప్పటి పంచాయతీ ఈఓ కోట్ల రూపాయల నిధులను గోల్‌మాల్ చేశాడని ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో టీడీపీ మండల కన్వీనర్ రామమునిరెడ్డి జిల్లా కలెక్టర్‌క ఫిర్యాదు చేయగా కమిటీ సభ్యులతో విచారణ చేపట్టారు. అందుకు సంబంధించి జమ్మలమడుగు డీఎల్‌పీఓ విజయ్‌భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు మాధవరెడ్డి, బషీర్, శ్రీనివాసరావులతోపాటు పలువురు అధికారులు రికార్డులను పరిశీలించారు. అప్పటి ఇఓ నాగభూషణం రెడ్డితో నిధులపై అధికారులు చర్చించారు. త్వరలోనే పూర్తిస్థాయి విచారణ చేపట్టి జిల్లా కలెక్టర్‌కు నివేదికలను ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు.

మహానంది కొర్ర రకాన్ని వాడండి

చింతకొమ్మదిన్నె : కమ్మవారిపల్లి పంచాయతీలోని గొల్లపల్లి గ్రామంలో ఎస్.వెంకట్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి పొలాల్లో కొర్ర క్షేత్ర దినోత్సవ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారి ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ మహానంది కొర్ర రకం పంట 80 రోజుల నుంచి 85 రోజుల మధ్య కాలమని అగ్గి తెగులు, వెర్రి కంకి తెగులులను కొంతవరకు తట్టుకుంటుందన్నారు. ఈ రకం పంట తట్టుకొని యాంత్రికరణకు అనువైన రకం అన్నారు. ఒక ఎకరాకు దిగుబడి దాదాపు 11 నుంచి 12 క్వింటాళ్ల వరకు వస్తుందన్నారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ కె. అంకయ్య, కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ వీరయ్య, రైతులు పాల్గొన్నారు.

అన్నదానం

పులివెందుల టౌన్ : పట్టణంలోని కచేరి రోడ్డులో ఉన్న వీర అంధుల ఆశ్రమంలో శనివారం లింగాల మండలం వెలిదండ్ల గ్రామానికి చెందిన గంగిరెడ్డి శ్యామసుందర్‌రెడ్డి జ్ఞాపకార్థం భార్య సుబ్బలక్షుమ్మ, కుటుంబ సభ్యులు అంధులకు భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు అనిమెల రామ్మోహన్ పాల్గొన్నారు.

హామీలు అమలు చేయలేకే కుంటిసాకులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగు రూరల్ : ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయలేకనే చంద్రబాబునాయుడు ప్రభుత్వం కుంటిసాకులు వెదుకుతోందని ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి ఆరోపించారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన తిరుమల తిరుపతి వెంకటేశ్వస్వామి ప్రసాదం లడ్డులో నెయ్యిలో జంతు కోవుబరాలు, పంది కొవ్వు, వెజిటబుల్ నూనెలు కల్తీ జరిగిందని చెప్పడం బాధాకరమన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడి వంద రోజల పాలనలో ప్రభుత్వం పూర్తి విఫలమైందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా అమలు పరచలేదన్నారు. దీంతో ప్రజల దృష్టిని మరలించేందుకు రాజకీయ కుట్ర చేశారని ఆయన అన్నారు. సమస్య ఉత్పన్నమైనప్పుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై బురద జల్లడం తగదన్నారు. ప్రజలు అన్నీ గ్రహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ చిట్టెం విశ్వనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేవుడితో ఆట సరైంది కాదు

పులివెందుల రూరల్ : తిరుమల తిరుపతి వెంకటేశ్వరస్వామితో ఆటలు సరైంది కాదని కాంగ్రెస్ పార్టీ మాజీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీనివాసులరెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తిరుపతి లడ్డూలో కల్తీ జరిగిందని సీఎం చంద్రబాబు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. సరైన ఆధారాలతో నిరూపించి కల్తీ చేసిన వారిని జైలుకు పంపాలన్నారు. ప్రపంచంలోనే అత్యధిక భక్తులు కలిగిన తిరుపతి వెంకటేశ్వరస్వామి లడ్డుపై ఇలా నిందలు వేయడం దేవస్థానానికి చెడ్డ పేరు అన్నారు.

మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను అడ్డుకుంటాం



నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

జమ్మలమడుగు : రాష్ట్ర ప్రభుత్వం వైద్య విధాన ప్రైవేటీకర చేయడం కోసం చేస్తున్న ప్రయత్నాన్ని అడ్డుకుంటామని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు గండి సునీల్‌కుమార్ తెలిపారు. శనివారం పట్టణంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ ప్లకార్డ్స్‌ను చేతబట్టి నిరసన వ్యక్తం చేశారు. తెలుగుదేశం ప్రభుత్వం విద్యా వ్యాపారకరణకు శ్రీకారం చుట్టిందన్నారు. అందులో భాగంగా విద్యలో అత్యున్నతమైన వైద్య విద్యను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదని ఆయన విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా 12 వైద్య కళాశాలలు నిర్మాణంలో ఉన్నాయి. అందులో 2024-25 విద్యా సంవత్సరం కోసం పులివెందుల, ఆదోని, మార్కాపురం, మదనపల్లి, పాడేరు ప్రాంతాలలో నూతన కళాశాలలు పూర్తిస్థాయిలో నిర్మాణం జరిగి ఉన్నాయన్నారు. ఎన్ఎంసి ప్రతి కళాశాలలో 150 మంది విద్యార్థులకు సీట్లు కేటాయించి ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించుకోవడం కోసం అనుమతి కూడా జారీ చేసిందన్నారు. వైద్య కళాశాలలు నిర్వహించలేం అని ఎన్ఎంసీకు లేఖ వ్రాయడం బాధాకరమన్నారు. దీంతో 700 సీట్లు రద్దు కావడం జరుగుతుందన్నారు. దీంతో పేద మధ్య తరగతి విద్యార్థులు వైద్య విద్యకు దూరం చేసే కుట్రను ప్రభుత్వం చేస్తున్నదని ఆయన విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య కళాశాలలను మూసివేసే ప్రయత్నం మానుకోవాలని లేనట్లయితే రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులతో కలసి పెద్ద ఎత్తున ఉద్యమం నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

వంటకాలపై అవగాహన



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ శ్రీలత

సింహాద్రిపురం : మండలంలోని కోవరంగుటపల్లెలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషక మహా కార్యక్రమంలో భాగంగా శనివారం గర్భిణులు, బాలింతలు, తల్లులకు కాంప్లిమెంటరీ ఫుడ్ వంటకాల తయారీపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీలత హాజరై మాట్లాడుతూ గర్భిణిగా ఉన్నపుడే మంచి పౌష్టికాహారంతోపాటు చిరుధాన్యాలు బాగా తీసుకుంటే పుట్టబోయే బిడ్డలు ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. పుట్టిన బిడ్డకు ఆరు నెలల వరకు తల్లి పాలు మాత్రమే తాగించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసంత, హెల్త్ సూపర్‌వైజర్ రాధ, సీహెచ్‌ఓ ఓబులేసు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు అవసరం



హ్యాండ్‌బాల్ క్రీడాకారులతో సర్పంచ్ శ్రీనివాసులు

వేంపల్లె : శారీరక, మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో అవసరమని వేంపల్లె గ్రామ సర్పంచ్ ఆర్.శ్రీనివాసులు తెలిపారు. శనివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ సబ్ జూనియర్ పోటీలకు విశిష్ట అతిథిగా ఆయన హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకుని మాట్లాడారు. క్రీడాకారులు అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేయాలన్నారు. ప్రతి క్రీడాకారుడు తమ ప్రతిభను చాటి చెప్పి, తల్లిదండ్రులకు, ప్రాంతానికి మంచి గుర్తింపు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ బాలుర హెచ్ఎం శివమునెమ్మ, ఫిజికల్ డైరెక్టర్ రాజశేఖర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల అందజేత



వైవీయూ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ వెంకట్రామిరెడ్డికి సరుకులను అందిస్తున్న కళాశాల కరస్పాండెంట్



విద్యార్థులు సేకరించిన విరాళాలను పరిశీలిస్తున్న వైవీయూ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్

పులివెందుల టౌన్ : పట్టణంలోని లయోలా డిగ్రీ కళాశాల విద్యార్థులు కళాశాల కరస్పాండెంట్ ఆంథోని స్వామి, ప్రిన్సిపాల్ అమల్ ఆరోగ్యరాజ్‌ల ఆదేశాల మేరకు వరదబాధితులకు అవసరమయ్యే వస్తువులు, నగదును సేకరించి యోగి వేమన విశ్వవిద్యాలయ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ వెంకట్రామిరెడ్డికి అందజేశారు. శుభ్రత, స్వచ్ఛత వంటి కార్యక్రమాలు కాకుండా ఇలాంటి విపత్తుల సమయంలో కూడా లయోలా డిగ్రీ కళాశాల విద్యార్థులు ముందున్నారని ఆయన అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కళ్యాణి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో..

వరద బాధితులకు పులివెందుల ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల ఎన్.ఎస్.ఎస్ యూనిట్- 1, 2ల ఆధ్వర్యంలో వలంటీర్లు విరాళాలు సేకరించారు. దీంతో యోగివేమన యూనివర్సిటీ ఎన్.ఎస్.ఎస్ కో ఆర్డినేటర్, అసోసియేట్ ప్రొఫెసర్ ఇన్ జువాలజీ ఎన్.వెంకటరామిరెడ్డిలు వలంటీర్ల సేవలను కొనియాడి విరాళాలను పరిశీలించారు. అలాగే మొక్కలను నాటే కార్యక్రమంలో పాల్గొని పర్యావరణాన్ని కాపాడాలన్నారు. అనంతరం గురజాడ అప్పారావు జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎల్.సుధీర, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్స్ శ్రీనిత, అధ్యాపకులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే రక్తహీనత నివారణ



పోషకాహారంపై ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

వేముల : మహిళలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతను నివారించవచ్చునని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హసీనా తెలిపారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషకాహార మాసోత్సవాలపై మహిళలకు ఆమె అవగాహన కల్పించి మాట్లాడారు. గర్భవతులు, బాలింతలు, కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. పౌష్టికాహారం తీసుకోవడంవల్ల పుట్టబోయే బిడ్డలు ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. ఆకు కూరలు, కాయ గూరలు, పప్పు దినుసులు తీసుకోవడంవల్ల మహిళలలో రక్తహీనత లోపం నివారించవచ్చునన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

రసాయనిక ఎరువులు తగ్గించాలి



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఏఓ, సిబ్బంది

వేంపల్లె : రైతులు సాగు చేసిన పంటలకు దిగుబడి రావాలంటే రసాయనిక ఎరువులను తగ్గించాలని మండల వ్యవసాయాధికారి రాజేంద్రప్రసాద్, ఏఈఓ సురేష్‌లు తెలిపారు. శనివారం వేంపల్లె పంచాయతీ పరిధిలో సాగు చేసిన వేరుశనగ పంటను వారు పరిశీలించారు. అలాగే పొలంబడిలో భాగంగా రసాయన క్రిమిసంహారక అవశేషాలు లేని పంట ఉత్పత్తులను, సేంద్రీయ పద్ధతుల ద్వారా సాగు చేసిన రైతులకు ఇండి -గ్యాప్ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఏఓ రాజేంద్రప్రసాద్ ఇండి గ్యాప్ సర్టిఫికెట్లవల్ల రైతుకు మంచి ధరకు ఉత్పత్తులు అమ్మకాలు చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ మల్లి, వీఏఓ శివ, రైతులు పాల్గొన్నారు.

నవ్య కవిత్వానికి వేగుచుక్క గురజాడ



వేంపల్లె : గురజాడ అప్పారావు చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్



వీఎన్‌పల్లె : గురజాడ అప్పారావు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు

వేంపల్లె : నేడు ఆధునిక భారతదేశం ఎదుర్కొంటున్న సమకాలిన సామాజిక సమస్యలకు గురజాడ అప్పారావు నాడే గమనించి అనేక సమస్యలకు పరిష్కారం చూపిన దార్శనికుడు గురజాడ అప్పారావు అని స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు తెలిపారు. కళాశాలలోని తెలుగు శాఖ ఆధ్వర్యంలో గురజాడ అప్పారావు జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. నేడు ఏ సమస్యలు అయితే సమాజ అభివృద్ధికి, రాజకీయ అభివృద్ధికి, దేశాభివృద్ధికి ఆటంకాలుగా ఉన్నాయో వాటినే నాడు పసికట్టి వాటన్నిటికీ పరిష్కారం చూపిన గొప్ప మేధావి అని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల తెలుగు శాఖాధిపతి డాక్టర్ నాగలక్ష్మి దేవి, కళాశాల లైబ్రరీ విభాగాధిపతి మాధవరావు, ఫిజికల్ డైరెక్టర్ తేజేంద్ర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : పాయసంపల్లెలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురజాడ అప్పారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి సుజన్‌కుమార్ గురజాడ అప్పారావు చిత్రపటానికి నివాళి అర్పించి మాట్లాడారు. దేశభక్తి అంటే దేశంలో ఉన్న ప్రజలందరితో సోదరభావం కలిగి ఒక తల్లి బిడ్డల్లాగా మెలగాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మురళీకృష్ణ, జనవిజ్ఞాన వేదిక సభ్యుడు బేరి మోహన్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.